పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

షాద్‌నగర్, జనవరి 24: అన్ని వర్గాల ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలో రక్తహీనత నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మన జీవన శైలి ఉండాలని చెప్పారు. సంప్రదాయ, పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. అప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు రక్తహీనతపై గ్రామీణ ప్రాంతాల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఇందులో భాగంగానే వైద్య సిబ్బంది పలువురి బాలికలు, మహిళలకు రక్తహీనత పరీక్షలు చేసి తగిన సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారిని విజయలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

నందిగామ, జనవరి 24 : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం సింబయాసిస్ యూనివర్సిటీలో బుధవారం ట్రాఫిక్ నియమాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని ట్రాఫిక్‌పై నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌హెచ్‌సీ మస్తాన్‌వలి, పీసీ శ్రీకాంత్‌రెడ్డి, శివకుమార్, షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- జిల్లాలో ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

షాద్‌నగర్ : బాలికల దినోత్సవంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జనవరి 24 : బాలికలు అన్ని రంగాల్లో రాణించి సమాజంలో తగిన గుర్తింపు పొందాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో బాలికలకు చదువు చాలా ముఖ్యమని, ఎన్ని ఇబ్బందులు ఎదురైన తల్లి దండ్రులు తమ పిల్లలను చదివించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బాలికల విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని, అన్ని పాఠశాలల్లో ఆంగ్లంలో బోధన జరుగుతుందని చెప్పారు. బాలికల సమస్యలపై ఎప్పటికప్పుడూ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదే విధంగా కేక్‌ను కట్ చేసి బాలికలకు పంచి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాల, నందిగామ ఎంపీపీ ప్రియాంక, కౌన్సిలర్ చెట్ల పావణి, అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

చేవెళ్లటౌన్ : బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రక్తహీనత ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతి విద్యార్థినికి హెల్త్ క్యాంపు ద్వారా బాలికలకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, ఎన్ఎస్ఎస్ యూనిట్ కో ఆర్డినేటర్ జ్యోతి, షేక్ మహబూబ్, స్వర్ణలత, సతీష్, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలికలపట్ల వివక్ష చూపొద్దు

ఆదిబట్ల : బాలికల పట్ల వివక్ష చూపకూడదని ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్కాల పరమేశ్ అన్నారు. బుధవారం ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలికలను రక్షిద్దాం.. బాలికలను ఎదుగనిద్దాం.. సాధికారత సాధింప చేద్దాం.. అనేదానిపై పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి పాఠశాలలో అన్ని రంగాల్లో విభిన్న ప్రతిభ చూపిన బాలికలకు ప్రోత్సాహకంగా బహుమతులు అందజేశారు. బాలికలను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు బాబ్లీ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కార్యకర్తలే బీఆర్ఎస్‌కు బలం

- షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ఎస్‌బీపల్లిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు, జనవరి 24: కార్యకర్తలే బీఆర్ఎస్‌కు బలం అని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. కొత్తూరు మండలంలోని మక్తగూడ, మల్లాపూర్, మల్లాపూర్ తండా, కొడిచెర్ల, తీగాపూర్, పెంజర్ల, సిద్దాపూర్, ఎస్‌బీపల్లి తదితర గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ బుధవారం పర్యటించి కార్యకర్తలను కలిశారు. ఆయా గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తాను ఎమ్మెల్యేగా ఉన్న రోజుల్లో పని చేశానని చెప్పారు. తనకు వీలైనంత ఎక్కువగా మండల అభివృద్ధికి కృషి చేశానని గుర్తుచేశారు. త్వరలో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తానని చెప్పారు. పార్టీ సమావేశాలు, సమీక్షలు ఉంటాయని స్పష్టం చేశారు. పార్టీకి సేవ చేస్తే పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వివరించారు. ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన ఎస్‌బీపల్లి కార్యకర్తలు

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కృషి వల్లే ఎస్‌బీపల్లికి రూ. 40 లక్షలు మంజూరయ్యాని, అందువల్లే సీసీ రోడ్లు పనుల జరుగుతున్నాయని చెప్పారు. తమ గ్రామంలోకి రోడ్ల నిర్మాణానికి కారణమైన మాజీ ఎమ్మెల్యేకు ఎస్‌బీపల్లి వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎమ్మె సత్యనారాయణ, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి, నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మెండె కృష్ణయాదవ్, ఎంపీటీసీ రవీందర్‌యాదవ్, కళ్లెం నర్సింహారెడ్డి, జంగయ్య, దేశాల భీమయ్య, సర్పంచ్‌లు రవినాయక్, కాట్నరాజు, గోపాల్ నాయక్, శ్రీరాములు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్, జనవరి 24: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మాంటిస్సోరీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఉన్న మేధా శక్తిని పెంపొందించేందుకు ఇలాంటి సైన్స్‌ఫెయిర్ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని చెప్పారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్, పాఠశాల సీఈవో జార్జ్ థామస్, కరస్పాండెంట్ మహేశ్‌యాదవ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రమేశ్‌యాదవ్, రాందేవ్‌యాదవ్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

చేవెళ్ల రూరల్, జనవరి 24 : రైతులు పండిస్తున్న పంటలను మండల వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తూ అధిక దిగుబడుల సాధనలో కీలక పాత్ర పోషిస్తున్నారు. బుధవారం మండల పరిధి అంతారం అనుబంధ గ్రామం నవలయపల్లిలో వ్యవసాయ అధికారి తులసి పర్యటించి కుసుమ పంటను పరిశీలించారు. రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. యాసంగిలో కుసుమ పంట సాగు విస్తీర్ణం కొంత మేరకు తగ్గిందని, అకాల వర్షాలే ఇందుకు కారణమని అన్నారు. రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టి తెగుళ్లు సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రాజేశ్వర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కుసుమ పంటను పరిశీలిస్తున్న ఏవో తులసి, పక్కన వ్యవసాయ విస్తరణాధికారి రాజేశ్వర్‌రెడ్డి

అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలి

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్, జనవరి 24 : గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ రాములునాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధిలో కడ్తాల్ మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. మండల పరిషత్ నిధులతో ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని వివరించారు. అంతకుముందు తండాలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సోమ్లా, వినోద్, మోహన్, వెంకట్‌నాయక్, భాస్కర్, నాయకులు మన్యానాయక్, రమేశ్, ఛత్రూనాయక్, గోపాల్, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యాచారం, జనవరి 24 : విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా నేడు మండలంలోని తులేఖుర్దు, ధర్మన్నగూడ, పెత్తుల్ల, తాటిపర్తి, పిల్లిపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సందీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1గంటల వరకు గృహ అవసరాలు, ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు వ్యవసాయం, కోళ్లపారాలకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నైపుణ్యాలు పెంచుకుంటే ఉద్యోగాలు

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కాలేజీ, వివిధ కంపెనీల ప్రతినిధులు

పెద్దఅంబర్‌పేట, జనవరి 24: ఎప్పటికప్పుడు టెక్నాలజీని అందిపుచ్చుకుని నైపుణ్యాలు పెంచుకుంటే ఉద్యోగాలు వెతుక్కుంటూ వస్తాయని పల్లవి కాలేజీ విద్యాసంస్థల చైర్మన్ మల్క కొమురయ్య అన్నారు. కుంట్లూరు సమీపంలోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో ఫైనల్ ఈయర్ విద్యార్థులకు 14 కంపెనీలతో మెగా రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో దాదాపు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు వివిధ పరీక్షలు నిర్వహించారు. కాలేజీకి చెందిన 100 మంది విద్యార్థులు ప్రతిభ చాటి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని ఆయన తెలిపారు. వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను కాలేజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎంబీ రాజు, ఏవో శ్రీధర్ అభినందించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రతినిధులు రాజేందర్‌రెడ్డి, సుమేధ రమేశ్, స్రవంతి, విశ్వప్రకాశ్‌బాబు, శరత్ చంద్ర, కవిత, రమ్య, నవ్య, జ్యోతిర్మయి, ప్రియంవధ తదితరులు పాల్గొన్నారు.

ఔదార్యం చాటుకున్న గ్రామ యువకులు

హర్యకు మేకలను అందజేస్తున్న గ్రామ యువకులు

కడ్తాల్, జనవరి 24 : మండల పరిధిలోని వాసుదేవ్‌పూర్ గ్రామానికి చెందిన పాత్లావత్ హర్య మేకల పెంపకం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం హర్యకు చెందిన 11 మేకలను అర్ధరాత్రి సమయంలో దొంగలు అపహరించారు. దీంతో తన జీవనాధారం పోయిందని హర్య వాపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామ యువకులు రూ.30వేల విలువ చేసే మేకలను హర్యకు ఇప్పించటం జరిగింది. పలువురు వారిని అభినందించారు. ఈ సందర్భంగా హర్య గ్రామ యువకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

తనిఖీ చేస్తున్న వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి, సీఐ మన్మోహన్‌యాదవ్

పెద్దఅంబర్‌పేట, జనవరి 24: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్టు పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. పెద్దఅంబర్‌పేట ఓఆర్ఆర్ టోల్ గేట్ వద్ద 452 వాహనాలు నిలిపి తనిఖీలు చేశారు. వాహన తనిఖీలను ఎల్బీనగర్ డీసీపీ (క్రైం) అరవింద్, ఏడీసీపీ కోటేశ్వర్‌రావు, వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి పరిశీలించారు. ముందు జాగ్రత్త చర్యగా తనిఖీలు చేపడుతున్నట్టు సీఐ మన్మోహన్‌యాదవ్, ఎస్సై వెంకట్రాంరెడ్డి తెలిపారు.

అక్రమ కట్టడం కూల్చివేత

నందిగామ, జనవరి24: అప్పారెడ్డిగూడ గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న అక్కమ్మ చెరువు వాగుకు సమీపంలో సర్వే నెంబర్ 1452లో కొందారు వ్యాపారులు భూములు కొనుగోలు చేసి వాగును ఆక్రమించుకుని ప్రహరీని నిర్మిస్తున్నారు. దీంతో బుధవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిశీలించి అక్రమంగా కట్టిన ప్రహరీని తొలగించారు.

పశుగ్రాసం కొరత.. పశువులకు గోస

- వరికోత యంత్రాలతో చేతికి అందని వరిగడ్డి
- ట్రాక్టర్ గడ్డి రూ.10వేల నుంచి రూ.12వేలు

మొయినాబాద్, జనవరి 24 : ఆరుగాలం కష్టపడి పండించిన రైతన్నలకు పశుగ్రాసం కష్టాలు తప్పడం లేదు. యంత్రాలతో వరికోతలు కోయించడంతో పంట మాత్రమే చేతికి వస్తుంది. వరి గడ్డికి మాత్రం నానాతంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆధునిక పోకడలతో పాడి రైతులకు పశుగ్రాసం కష్టాలు తలెత్తాయి. మారుతున్న కాలాన్ని బట్టి రైతులు సాగు విషయంలో సులభ పద్ధతులను అవలంబిస్తున్నారు. మండలంలో 5956 ఎకరాలల్లో వరి సాగు చేశారు. వరికోసే యంత్రలతో వరి గడ్డి చేతికి రాకపోవడంతో పశుగ్రాసం విషయంలో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. గతంలో కూలీలు చేతితో వరి కోసినప్పుడు వడ్లతో పాటు వరి గడ్డి రైతు చేతికి వచ్చేది. దీంతో అప్పుడు పశుగ్రాసం కొరత లేకుండా ఉండేది కాదు. చేతి కోత కోస్తే ఎకరానికి రూ.పదివేల ఖర్చు వస్తుంది. యంత్రాలతో వరిని కోస్తే ఎకరానికి రూ.5వేలతోనే వరి ధాన్యం ఇంటికి చేరుతుంది. దీంతో తక్కువ ఖర్చు వస్తుండటంతో రైతులు పంటలను ఇంటికి చేర్చేందుకు యంత్రం విధానాన్ని అనుసరిస్తున్నారు.

పెరిగిన పశుగ్రాసం ధర..

ట్రాక్టర్ ధర రూ.10 వేల నుంచి 12వేలు పలకడంతో రైతులు పాడి పశువులను పోషించడంలో తీవ్ర కష్టాలు పడుతున్నారు. ఎంత ఖర్చు అయినా పశువులకు పశుగ్రాసం కొనక తప్పడం లేదు. చేవెళ్ల డివిజన్‌లో వరి సాగు చాలా వరకు తగ్గడంతో పశుగ్రాసం కొరత ఏర్పడుంది. చేవెళ్ల డివిజన్ హైదరాబాద్ నగరానికి అతి సమీపంలో ఉండటం.. రియల్ వ్యాపారం బాగా ఉండి వ్యవసాయ భూములు అమ్ముడు పోయాయి. అమ్మిన భూముల్లో వ్యవసాయ క్షేత్రాలుగా ఏర్పాటు చేసుకుని పండ్ల తోటలు పెట్టుకోవడం వంటి పద్ధతి కొనసాగుతుంది. దీంతో వరి సాగు చాలా వరకు తగ్గింది. పంటలు సాగు తగ్గడం పక్కన పెడితే చాలా వరకు రైతులు పాడి పరిశ్రమను ఏర్పాటు చేసుకుంటున్నారు. కానీ పశువులకు కావాల్సిన పశుగ్రాసం కొరతతో మాత్రం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చేవెళ్ల డివిజన్‌లో నవాబ్‌పేట, షాబాద్ మండలాల్లో కొంత మేరకు వరి సాగు చేస్తున్నారు. చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో వరి సాగు చాలా వరకు తగ్గింది. దీంతో వరి గడ్డిని బయట నుంచి కొనుగోలు చేసే పరిస్థితి దాపురించింది. కొందరు రైతులు యంత్రాలతో కోసిన గడ్డిని యంత్రాలతోనే కట్టలు కట్టిస్తున్నారు. యంత్రం ద్వారా కట్టల కట్టిన యజమానికి డబ్బులు చెల్లించి పశుగ్రాసం కొనుగోలు చేస్తున్నారు. పశు గ్రాసం కొరత లేకుండా ప్రభుత్వం సబ్సిడీ మీద దాన ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

నిర్మాణ పనులను పూర్తి చేయండి

షాద్‌నగర్, జనవరి 24 : ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో పాత జాతీయ రహదారి సమీపంలో ఆలయాన్ని తొలగించి రోడ్డుకు కొంత దూరంగా నిర్మిస్తున్న దేవాలయాన్ని త్వరగా పూర్తిచేయాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న సమయంలో ప్రభుత్వం రూ.7 లక్షల నిధులను విడుదల చేసిందని, అయినప్పటికీ అప్పటి రోడ్డు నిర్మాణ గుత్తేదారి దేవాలయం నిర్మాణానికి రూ. 3.5 లక్షల నిధులను ఖర్చుచేసి మిగతా నిధులు రాలేదని నిర్మాణ పనులను నిలిపివేసినట్లు అధికారులకు వివరించారు. దేవాలయాన్ని త్వరగా పూర్తి చేసేందుకు నిధులను మంజూరు చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

చేవెళ్లటౌన్, జనవరి 24: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్ అన్నారు. బుధవారం చేవెళ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. మునీర్ పాషా, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయానందం, శివానందంతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నారాయణ, అంజయ్య, మొగు టలయ్య, శంకరయ్య, లక్ష్మి, శ్రీరత్న, హెచ్ఎం మెహరున్నీసా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం

లీడ్ ఎర్త్ లీడర్స్ శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కడ్తాల్ , జనవరి 24 : పాఠశాలల్లో వినూత్న మార్పులకు లీడ్ ఎర్త్ లీడర్స్ అనే శిక్షణ శిబిరం ఉపయోగపడుతుందని గ్రీన్ ఫర్ రెవల్యూషన్ సంస్థ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన లీడ్ ఎర్త్ లీడర్స్ అనే రెండు రోజుల శిక్షణ శిబిరం ముగిసింది. ఈ శిక్షణ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 65 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శిబిరంలో పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణ, నాయకత్వం రూపొందించటానికి కావాల్సిన శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో గ్రీన్ ఫర్ రెవల్యూషన్ సంస్థ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఈ శిక్షణ కార్యక్రమం పాఠశాలల్లో మంచి మార్పులకు భూమిక అవుతుందని తెలిపారు. తదనంతరం ముఖ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, జేఎస్ఆర్ అన్నమయ్య, విశ్రాంత భూగర్భ శాస్త్రవేత్త డాక్టర్ హరి సర్వోత్తమం, వ్యవసాయ శాస్త్రవేత్త మహేశ్, పర్యావరణ శాస్త్రవేత్త రజనీకాంత్, ఉపాధ్యాయులు రమేశ్, వేణుగోపాల్, దీపిక, సీజీఆర్ ప్రతినిధులు వెంకటేష్, లక్ష్మీ ప్రసన్న, నాగేష్, సుష్మ, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న గౌస్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

యాచారం, జనవరి24 : ప్రభుత్వ దవాఖాన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య విధాన పరిషత్ పారిశుధ్య కమిటీ సూపర్‌వైజర్ గౌస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖాన పరిసరాల శుభ్రతను ఆయన పరిశీలించారు. నిత్యం చేపడుతున్న స్వచ్ఛత కార్యక్రమాలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దవాఖానతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. వార్డులు, రోగుల గదులు, ఓపీ గది ప్రతి రోజు శుభ్రం చేయాలన్నారు. ప్రజలకు అన్ని రకాల సేవలతో పాటు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆయన వెంట వైద్యులు, సిబ్బంది ఉన్నారు.